# సత్యవాక్యము

## the word of truth

క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY 1997

# సంక్షిప్త వార్తలు

1997 జనవరి 9 నుండి 14 వరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో 12వ గొప్ప బైబిలు సెమినార్ జరిగెను. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాలనుండియు, భారత దేశములోని పలు రాష్ట్రముల నుండియు ప్రజలు ఈ సెమినార్‌కు హాజరై జయప్రదము గావించిరి. ఇందు అమెరికానుండి వచ్చిన జాన్‌ఫోర్డ్ గారు మాత్రమే గాక కలకత్తానుండి కె. స్వామిదాస్‌గార్లు, ఇంఫాల్‌నుండి శ్యామ్‌సలామ్ గారు, ఢిల్లీ నుండి ఫ్రాన్సిస్ డేవిడ్ గారు వచ్చి చక్కటి వాక్యోపదేశము గావించిరి. మరియు పలు పట్టణములనుండి వచ్చిన భారతీయ సువార్తికులు కూడ వాక్యపరి చర్య చేసిరి. సెమినార్ కొరకు ప్రత్యేక కీర్తనల పుస్తకము ముద్రించబడగా అందులోని క్రొత్త కీర్తనలు నేర్చుకొని ప్రజలు ప్రభువును స్తుతించిరి. సోదరులు టి.వి.యన్. కుమార్, గంటా ఫిలిప్పు, పి.చంద్రశేఖర్, జాషువాగూటం గార్లు అనువాదకులుగా నుండి గొప్ప పరిచర్య గావించిరి.

జనవరి 12వ తేదీ ఆదివారమునాడు జరిగిన ఆరాధనలో ఇంచుమించు రెండు వేలమంది పాల్గొని రొట్టె విరచిరి. జనవరి 14వ తేదీనాడు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ యొక్క గ్రాడ్యుయేషన్ జరిగెను. సెమినార్ కాలములో సోదరి నేన్సీ ఫోర్డు గారు స్త్రీలకు ప్రత్యేక తరగతులు జరిపిరి. సెమినార్ సమయములో పలు ప్రాంతములనుండి వచ్చిన 219 మంది బాప్తిస్మము పొందిరి. దూరప్రాంతమునుండి వచ్చిన వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యములు కల్పించబడెను. కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్ నెహెమ్యా గూటం గారు ఎంతగానో శ్రమించి, చక్కని ఏర్పాట్లు చేసి సమస్తము సక్రమముగాను, మర్యాదగాను, దేవునికి మహిమ కరముగాను జరిపించిరి.

జనవరి 15నుండి 19వరకు వరంగల్లులో గొప్ప క్రీస్తు సువార్త సభలు జరిపించ బడెను. వరంగల్లు పుప్పాలగుట్టలో గల విశాలమైన క్రీస్తు సంఘ ఆవరణ లో ఈ సభలు జరిపించబడగా వేలాదిప్రజలు హాజరై దేవుని వాక్యము వినిరి. ఈ సభలలో జాన్‌ఫోర్డు గారు, నెహెమ్యా గూటంగారు, పి. చంద్రశేఖర్ గారు, జి.ఫిలిప్పు

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 ఫిబ్రవరి 1997 సంచిక 7

## సంపాద కీయం

### ఆరాధనలో సంశయింపదగిన సంగతులు

**(Questionable Things in Worship)**

దేవుని మాట చొప్పున చేయుటలో మానవులు సంతృప్తి జెందుచున్నట్లు కనబడరు. దేవుని మాటలను వారు ఎల్లప్పుడు ప్రశ్నించుచునే యుందురు, క్రొత్త పద్ధతులను ప్రవేశపెట్టుదురు, ప్రయోగములను చేయుచున్నారు. ఈ సందర్భములో ఆరాధనను గూర్చి మనం ఆలోచించవచ్చును.

మనం దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలి. దేవుని చిత్తాన్ని గ్రహించుకోవాలి (యోహాను 4:24). కొందరు దీనికి బద్ధులై యుండలేరు. అందువలన వారు మానవ కల్పిత పద్ధతులు, ఆజ్ఞలను బట్టి ఆరాధించుటకు మొదలిడుదురు (మత్తయి 15:7-9). వారు వాద్యములను ఉపయోగిస్తారు, చప్పట్లు కొట్టుదురు, రకరకాల శబ్దములు చేయుదురు. మనం ఆరాధన ఎందుకు చేయుచున్నాము ? మనలను సంతోషపెట్టుటకా లేక దేవుని సంతోషపెట్టుటకా ? వారు ఆలోచించరు.

దేవుడు కోరు ఆరాధనలోనైయితే, మనము పాటలు పాడి దేవుని స్తుతించాలని ఆయన కోరాడు (ఎఫెసీ 5:19). వాద్య సంగీతములో యేమీ తప్పులేదు. అయితే ఆరాధనలో వాద్యములను ప్రవేశపెడితే అంతా తప్పే. దేవుడు సృష్టమైన మానవుని స్వరగానముతో స్తుతింపబడ గోరుచున్నాడు గాని నిర్జీవనాద స్వరములతో కాదు. మనం దేవుని సంతోషపెట్టాలని ఆయన కోరుచున్నాడు. మనం ఆయనను సంతోషపెట్టినపుడు సంతోషపడ్తారు.

పాటలు పాడుచు చప్పట్లు కొట్టుటయెంతో, ఆరాధనలో వాద్యసంగీతము అంతే. డప్పులు కొట్టుట, చప్పట్లు కొట్టుట, రెండూ సమానప్రభావాన్నే కలుగజేస్తాయి. ఈ రెండు సందర్భాల్లోను పాటలు పాడుచు ప్రభువును కీర్తించుచు హృదయములో గానము చేయుటకు బదులు ఒకడు ఏదో ఒక దానిని కొడుచు శబ్దములు చేయుచున్నాడు. అంతేకాదు, చప్పట్లు కొట్టుటవలన ఉద్వేగ భరితులై ప్రజలు అర్థరహితముగా ఆరాధింతురు. అంతేకాకుండా ఆ శబ్దము వలన పాటలు వినబడవు, దానిలో మాటలు తెలియవు; ఇంతకీ మిగిలేది చప్పట్లు తప్ప యేమీ ఉండదు, యిది దేవుడు కోరు సంగీతము కాదు. దేవుని ప్రజలు పాటలు పాడుచు, చప్పట్లు కొట్టుచు దేవుని ఆరాధించునట్లు లేఖనములలో ఎక్కడా కనుగొనవు.

అయితే వాద్య సంగీతముతో దేవుని ఆరాధించే సంగతి యేమిటి ? మనం వాద్యాలతో దేవుని ఆరాధించాలని ఆయన కోరితే దేవుడు దాన్ని గూర్చి తప్పక తన వాక్యమందు చెప్పియుండును. అయితే ఇవన్నీ మానవ కల్పితములే. దేవుని అనుమతి లేకుండా ఆరాధనలో చేర్చబడినవే. మనం ఒకని నొకడు హెచ్చరించు కొనుటకు, బోధించుటకు, దేవుని స్తుతించుటకు కీర్తనలు పాడాలని ఆయన ఆజ్ఞాపించాడు. ఈ విధంగా దేవుడు స్తుతింపబడతారు గాని మానవ కల్పిత వికృత శబ్దములతో కాదు.

మనం దేవుని ఎట్లు ఆరాధించాలో ఆయన స్పష్టం చేసారు. అదేదో క్రొత్తది, వింతైనది కాదు. మనం క్రొత్తగా కనుగొన్న పద్ధతి కూడ కాదు, సరిగదా శతాబ్దముల తరబడి దేవునికి అర్పించబడుచున్న ఘనత, మహిమయే అది. దాన్ని బట్టి దేవునికి విసుగురాదు. దానిలో ఆయన మార్పు కోరుటలేదు. మనం

జ్ఞానులమైతే దేవుడు కోరు రీతిగానే ఆయనను ఆరాధింతము. మనం హృదయ పూర్వకముగా దేవుని ఆరాధింధించిన యెడల అది పాతదైపోదు, విసుగుకూడా రాదు.

క్రీస్తు యెడల మనం సజీవులుగా యందుముగాక, దేవునికి స్తుతి గీతములు పాడుచు ఆసక్తి కలిగి యుందుము గాక.

## సుదీర్ఘ ప్రసంగము

**(The Longest Sermon )**

వేలకొలది సంవత్సరముల క్రితము పాపపు ప్రజల మధ్య దేవుని బోధకుడొకడు జీవించేవాడు. అతడు ఆ దుష్ట జనాంగములకు రాబోవు దేవుని ఉగ్రతను గూర్చి వంద సంవత్సరములకు పైగా బోధించాడు. కాని అతని కుటుంబీకులు తప్ప ఆ నాటి లోకస్థులలో ఒక్కడు కూడా దేవునికి లోబడలేదు. తద్వారా ఆ బోధకుడు చాల నిరుత్సాహపడి యుండెను. దేవుడు కూడా బహుగా సంతాపము నొందెను.

తన కుంటుంబ సంభ్యుల సహాయముతో ఈ బోధకుడు 120 సంవత్సరముల మట్టుకు ఒక ఓడను దేవుడు చెప్పిన రీతిగా నిర్మించెను. తాను చేసిన బోధ నిమిత్తమును, తన జీవిత విధానము నిమిత్తమును, తాను నిర్మించుచున్న పెద్ద ఓడ నిమిత్తమును పాపులు అతని హేళన చేసిరి. అయితే చివరిగా దేవుడు భూమియంతటి మీదను జల ప్రళయము రప్పించి, ఆ బోధకుని అతని కుటుంబమును తప్ప అందరినీ నాశనము చేయుటకు నిశ్చయించెను. అది భయంకరమైన సమయం. ఏలయనగా భూప్రజలందరు ఇంచుమించు ఆ జలప్రళయములో నాశనమైరి. ఆ బోధకుడు అతని కుటుంబీకులు మాత్రమే రక్షించబడిరి.

ఆ బోధకుని పేరు నోవహు. ప్రపంచ వ్యాప్తిగా సంభవించిన ఈ జల ప్రళయమును గూర్చి ఆదికాండము 6,7,8 అధ్యాయాల్లో మనకు కనబడును. నీతిని ప్రకటించిన నోవహు అని అపో.పేతురు అతని గూర్చి చెప్పాడు (2 పేతురు 2:5).

భక్తిహీనులను నాశనము చేసిన జలప్రళయమే నోవహును అతని కుటుంబమును రక్షించెను. రక్షింపబడిన ఎనిమిదిమంది ఆత్మలు, నాశనమైన దుష్ట ప్రపంచమునుండి నీటివలన వేరు చేయబడిరి. నోవహు కాలములో రక్షించిన నీటిని అపో.పేతురు బాప్తిస్మముతో పోల్చాడు: "దేవుని దీర్ఘశాంతము ఇంక కని పెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచ బడుచుండగా, అవిధేయులైన వారియొద్దకు, అనగా చెరలో యున్న ఆత్మల యొద్దకు ఆయన ఆత్మ స్వరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణపొందిరి. దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది, అదేదనగా శరీర మాలిన్యమును తీసివేయుటకు కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1పేతురు 3:20-21).

జల ప్రళయములో నాశనమొందిన వారికి సుదీర్ఘ ప్రసంగము చేయబడినను అది వ్యర్థమాయెను. ఆ లోకమంతటిలోను ఎనిమిదిమంది మాత్రమే రక్షింపబడుట ఎంత విచారము! ఈ రోజుకూడ అనేకులు దేవునికి లోబడుటకు నిరాకరింతురు. నీతిని ప్రకటించు బోధకులు ఈనాడు కూడ హేళన చేయబడుచున్నారు. మరియు దేవుడు సంతాపము నొందుచున్నాడు. అయితే దేవుని శిక్ష మరల రాబోవుచున్నది. అయితే ఈ సారి దేవుడు అగ్నితో శిక్షించబోవు చున్నారు:

"కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారు మనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు. అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమై పోవును, భూమియు దానిమీదనున్న కృత్యములు కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమై పోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమై పోవు నట్టియు దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్త గలవారై యుండవలెను" (2పేతురు 3:9-12).

దేవుని సువార్త ప్రకటన నీ యెడల వ్యర్థము కానీయవద్దు. దుష్టలోకముతో నీవు నాశనము కావద్దు. నీ పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందు. " మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38).

## కాలము యొక్క పరమార్థము - 2


(The Essence of Time -2 )

క్రైస్తవ్యము చరిత్రార్థకముగా బయలు పరచబడినది. ఏదైనా చరిత్రను తెలిసికొనాలంటే పఠనము ఎట్లు అవుసరమో, అట్లే బైబిలు చరిత్ర విషయములో కూడ పఠనము అవుసరము. నీవు ఏదైనా అంశమును పఠించాలని కోరుచున్నట్లయితే, ఆ అంశముపై లిఖించబడియున్న సమాచారమునంతటినీ సేకరించుటకు ఉపకరించెదవు. ఒకవేళ నీవు పరీక్షలకు హాజరవుచున్నా, ఏదైనా ప్రమోషన్‌కు ప్రయత్నిస్తున్నా, ఆ అంశముపై సునాయాసముగా జవాబునీయగలవు. గొప్ప విజయాన్ని సాధించగలవు.

అయితే క్రైస్తవులమైన మనకు పరీక్ష సమయం వస్తున్నదని, దాని ఫలితం జీవన్మరణములలో ఏదో ఒకటి యని నీ వెరుగుదువా ? పాత నిబంధన పఠనము వలన ఆనాటి ప్రజలు దేవుని సంతోషపరచుటకు గాను ఏమేమి చేసారో లేక యేమి చేయలేదో తెలిసికొనగలము. మీకొక ఉదాహరణ నిస్తాను. రాజ్యము విభాగింపబడిన 250 సంవత్సరముల తరువాత ఇశ్రాయేలు ప్రవక్తయైన హోషేయ అష్షూరు దేశస్థుల వలనవారి రాజ్యము నాశనము గావించబడ బోవుచున్నదని గ్రహించి ఇట్లు వ్రాసాడు: "ఇశ్రాయేలు వారలారా, యెహోవా మాట ఆలకించుడి. సత్యమును కని కరమును దేవుని గూర్చిన జ్ఞానమును దేశమందు లేకపోవుట చూచి, యెహోవా దేశ నివాసులతో వ్యాజ్యెమాడు చున్నాడు....... నా జనులు జ్ఞానము లేనివారై నశించుచున్నారు. నీవు జ్ఞానమును విసర్జించు చున్నావు గనుక నాకు యాజకుడవు కాకుండ నేను నిన్ను విసర్జింతును; నీవు నీ దేవుని ధర్మశాస్త్రమును మరచితివి

గనుక నేనును నీ  కుమారులను మరతును" (హోషేయ 4:1-6).

దేవుని వాక్యమును మించినది యేదీ నేటివరకు లేదు. గనుక నీవు, నేను కూడ దేవుని వాక్యజ్ఞానము కొరకు కావలసిన గ్రంథములన్నియు సేకరించి పఠించుటకు ప్రయత్నించవలెను. ఆ గ్రంథములు దిగువ పటములో చేర్చుదము. గడియారపు పటము యొక్క రెండవ దశలో గ్రంథములు కాలానుగుణముగా ఉంచబడినవి. ఏలయనగా ఆ గ్రంథములో యేమి వున్నదో దానిని మనము తెలిసికొనగోరుచున్నాము. బైబిలులో కనబడు క్రమము ప్రకారము గాక అవి కాలానుగుణంగా యుంటే చాలు.




ఒంటి గంట - ఆదికాండము మొదటి ఏడు అధ్యాయములున్నవి. అందు ప్రపంచ సృష్టి జరిగిన ఏకైక వివరణ మరియు జలప్రళయమునకు ముందున్న 1665 సంవత్సరముల చరిత్ర లిఖింపబడియున్నది.

రెండు గంటలు - ఆదికాండము 8నుండి 11వరకున్న అధ్యాయము లలో నోవహు కుటుంబము మెసపొతొమియ ప్రాంతములకు తరలివచ్చుట కలదు. మెసపొతొమియ అనగా టైగ్రీసు, యూఫ్రటీసు నదుల

మధ్య స్థలము. అబ్రాహాము పిలవబడే వరకు అది నాలుగు వందల సంవత్సరముల కాలము.

మూడుగంటలు - ఆదికాండము 12వ అధ్యాయములో అబ్రాహాము యొక్క పిలుపును మనము చూడగలము. ఆది.కా. 12-50 అధ్యాయములలో అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపుల జీవిత చరిత్ర మనకు కలదు.

నాలుగు గంటలు - నిర్గమకాండము మోషే జననముతో ఆరంభమై మొదటి 12 అధ్యాయములలోను ఐగుప్తు బానిసత్వమును వివరించును. 13నుండి 40 వరకు యున్న అధ్యాయములలో సీనాయి కొండ యొద్దకు ప్రయాణము మరియు ఆ ప్రాంతములో గడిపిన కాలము వర్ణించబడినది. సీనాయి వద్ద గడిపిన ఆ సంవత్సరములో దేవుడు ఇశ్రాయేలు జనాంగమునకు, వాగ్దానదేశము నిమిత్తము కొన్ని ఆత్మీయ సాంఘిక చట్టముల నిచ్చాడు. ఈ శాసనములు లేవీకాండములో లిఖించబడినవి.

ఐదు గంటలు - సీనాయి కొండవద్ద ఈ జనాంగము యొక్క సంఖ్య మొదటిసారిగ లెక్కింపబడుటతో సంఖ్యాకాండము ఆరంభమగును. అది వారి అరణ్యసంచారమును, యొర్దాను నది వద్ద వాగ్దాన దేశమును జయించుటకు ముందువారు రెండవ మారు లెక్కింపబడుటను వివరించును.

4-5 గంటల మధ్య గడియారపు పటములో మనము ద్వితీయోపదేశకాండము నుంచితిమి. ద్వితీయోప దేశము అనగా రెండవమారు చేసిన ఉపదేశము. యొర్దానుకు తూర్పున మోయాబు

ప్రాంతములో నెబో కొండమీద నుండి మోషే చేసిన మూడు ఉపదేశములు ఆ గ్రంధములో యున్నవి. సీనాయి కొండ వద్దనుండి వారి అరణ్య సంచారమంతటిలోను జరిగిన సంగతులను అతడు ప్రజలకు మరల జ్ఞాపకము చేసాడు.

ఆరు గంటలు - దేవుడు అబ్రాహాముకు అతని సంతతికి వాగ్దానము చేసిన దేశమును స్వతంత్రించుకొనుటకు గాను యెహోషువకు ఇశ్రాయేలు జనాంగము యొక్క నాయకత్వము అప్పగింపబడినది. ఆ విజయాన్ని యెహోషువ గ్రంధము తెలియ జేయు చున్నది.

ఏడు గంటలు - న్యాయాధిపతుల గ్రంధము యెహోషువ మరణించిన తరువాత, దేవుడు తన ప్రజలకు నాయకత్వము వహించి, కనానీయులను, యితరులను జయించుటకు దేవుడు ఏర్పరచుకొనిన పదముగ్గురు పురుషులు ఒక స్త్రీని గూర్చి మనకు బోధించును. వారు న్యాయాధిపతులని పిలువబడిరి. ఏడున్నర గంటలకు మనకు రూతు గ్రంధము కలదు. న్యాయాధిపతుల కాలములో రూతు గ్రంధము యొక్క చరిత్ర సంభవించెను. రాజైన దావీదు యొక్క వంశావళిని కూడ అది మనకు పరిచయము చేయును.

ఎనిమిది గంటలు - సమూయేలు ఇశ్రాయేలు యొక్క 15వ న్యాయాధిపతి. ఆఖరి న్యాయాధిపతి అయినను న్యాయాధిపతుల గ్రంధములో అతని జీవితము చెప్పబడలేదు. సమూయేలు గ్రంధము అతని జననముతో ఆరంభమగును. మరియు న్యాయాధిపతులనుండి రాజులకు అతని ద్వారానే నాయకత్వ

మార్పు సంభవించి నది. అతడు ఇశ్రాయేలీయుల మొదటి ఇద్దరి రాజు లను అభిషేకించెను. వారు సౌలు, దావీదు అనువారు. అందు వలన సమైక్య రాజ్యకాలములో (8గంటలకు) సమూయేలును మనము చేర్చితిమి. మొదటి సమూయేలు గ్రంధము సమూయేలు యొక్కయు సౌలు రాజుయొక్కయు జీవితాన్ని తెలియజేయును. రెండవ సమూయేలు గ్రంధము దావీదు యొక్క జీవితమును, 1రాజుల గ్రంధము 1నుండి 11 అధ్యాయములు సొలొమోను యొక్క జీవితమును తెలియజేయును.

తొమ్మిది గంటలు

విభాగింపబడిన రాజ్యమును గూర్చి మనము చదువ గలము. 1రాజులు 12నుండి 22 అధ్యాయము వరకును మరియు 2రాజులు 1నుండి 17 అధ్యాయములు వరకును విభాగింపబడిన రాజ్య కాలము మనకు కనబడును.

పది గంటలు

ఇశ్రాయేలు రాజ్యమును అష్షూరు దేశస్థులు చెరగొని పోయిరి గనుక యూదా రాజ్యము మాత్రమే మిగి లెను. 2రాజులు 18నుండి 24వరకు యూదా రాజ్యము యొక్క ఆఖరి రాజును గూర్చి తెలియ జేయును.

పదకొండు గంటలు

2రాజులు గ్రంధములోని ఆఖరి అధ్యాయము యూదా రాజ్యము బబులోను చెరలోనికి పోవుట వర్ణించును. మరియు 11.30 గంటలకు ఎస్తేరు గ్రంధము కనబడును. వారు చెరలో యుండగా ఎస్తేరు గ్రంధము యొక్క చరిత్ర సంభవించును. అందు వలననే దానిని ఎజ్రా, నెహెమ్యా గ్రంధము

లకు ముందుంచుట జరిగినది. లేనియెడల నెహెమ్యా గ్రంధములో పునరుద్ధరణను చదివిన తరువాత ఎస్తేరు గ్రంధములోనికి వెళ్ళి చెరలో యుండుటనుగూర్చిచదివితే గజిబిజిగా యుండును.

12 గంటలు

పునరుద్ధరణ. యూదులు తిరిగి వెళ్ళుటకు పర్షియా దేశపు రాజైన కోరేషు జారీ చేసిన ఆజ్ఞానుసారము యెరుబ్బాబెలు ఇశ్రాయేలీయులను తిరిగి తమ దేశమునకు తీసికొని వెళ్ళిన మొదటి దండయాత్రను గూర్చి మనం చదువగలము. ఎజ్రాగ్రంధము1నుండి 6 అధ్యాయములు చదివిన తరువాత ఎస్తేరు గ్రంధము చదువుము. యెరుబ్బాబెలు సారధ్యములో జరిగిన రెండవ దండయాత్రకును మధ్యకాలములో దేవాలయ పునరుద్ధరణ సమయంలో జరిగిన చారిత్రాత్మక రికార్డుగా ఎస్తేరు గ్రంధము మాత్రమే మనకున్నది. పునరుద్ధరణ సమాప్తమగుటను గూర్చి నెహెమ్యా గ్రంధము చెప్పుచున్నది. ఎజ్రా దిన వృత్తాంతము లను క్రోడీకరించెను. అవి యూదా రాజుల దిన వృత్తాంతములు మాత్రమే. యూదా రాజులు సంఘటనలలో ఇశ్రాయేలు రాజులు మిళితమై యున్న సందర్భములలో మాత్రమే ఇశ్రాయేలు రాజులను గూర్చి అందు చెప్పబడెను.

దేవుని చిత్తమును తెలిసికొనుటకు గాను మనము ఈ గ్రంధములను చదువవలెనని దేవుడు కోరుచున్నాడు. క్రీస్తు సంఘములో యున్న బైబిలు పండితులు వ్రాసిన అమూల్యమైన గ్రంధములు కూడ అనేకములున్నవి. అయితే

బైబిలును చదువుట మాని బైబిలును గూర్చి వ్రాయబడిన వాటిని చదువుట వలన మనం చాల సమయాన్ని కోల్పోవుదుము. ఒకడు క్రైస్తవుడగుటకున్న బీజము దేవుని వాక్యము. బైబిలు జ్ఞానమునకు మించిన జ్ఞానము వేరే యేదీలేదు. అది దైవవాక్య జ్ఞానమే. (సశేషం).

- ఫ్రేంకీ లూపర్.

కొండమీద ప్రసంగము-30

## అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్త పడుడి

(BEWARE OF FALSE PROPHETS)

(మత్తయి 7:15-20)

మత్తయి 7:15-20లో యేసుప్రభువు ఇట్లు బోధించారు: "అబద్ధప్రవక్తలను గూర్చి జాగ్రత్త పడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీయొద్దకు వత్తురు కానిలోపల వారు క్రూరమైన తోడేళ్ళు. వారి ఫలములు వలన మీరు వారిని తెలసికొందురు. ముండ్లపొదలలో ద్రాక్షపండ్లనైనను పల్లేరు చెట్లను అంజూరపు పండ్లనైనను కోయుదురా ? అలాగుననే ప్రతిమంచి చెట్టు మంచి ఫలములు ఫలించును, పనికి మాలిన చెట్టుకాని ఫలములు ఫలించును. మంచిచెట్టుకాని ఫలములు ఫలింపనేరదు. పనికి మాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదు. మంచి ఫలములు ఫలింపని ప్రతి చెట్టు నరకబడి అగ్నిలో వేయబడును. కాబట్టి మీరు వారి ఫలముల వలన వారిని తెలిసికొందురు".

కొండమీద యేసు ప్రభువు చేసిన ప్రసంగములో ఇంతకుముందు ఆయన రెండు ద్వారములను గూర్చి, రెండు నిత్యగమ్యములను గూర్చి చెప్పారు. అందులో ఒకటి సరియైనది, మరొకటి అసత్యమైనది. ఒకటి సత్యమార్గము, ఇంకొకటి అసత్యమార్గము. ఒకటి నిత్యజీవానికి నడుపును, మరొకటి నిత్యనాశనమునకు నడుపును. ఇప్పుడు మనము చదువుకొన్న లేఖన భాగంలో ఆయన అబద్ధ ప్రవక్త, లేక అబద్ధ బోధకులను గూర్చి హెచ్చరించారు. దేవుని బిడ్డలకు కలుగుహానిని గూర్చి ఆయన ఇంతకుముందే చెప్పారు; అందుకే దుష్టునినుండి మమ్మును

తప్పించుమని ప్రార్థించుడని తన శిష్యులకు నేర్పించారు (మత్త 6:13). ఇప్పుడు మనుష్యులను అసత్యమార్గమున నడిపించుటకు వచ్చువారిని గూర్చి ఆయన హెచ్చరించుచున్నారు. వారు తమ బోధవలన మనుష్యులను తప్పుత్రోవను పట్టిస్తారు.

తరువాత ఆయన గోదుమలు, గురుగులను గూర్చిన ఉపమానములో ఈ లోకంలో పనిచేయుచున్న రెండు గొప్ప శక్తులను గూర్చి ఉపదేశించారు. మనుష్యకుమారుడు మంచి విత్తనమైన దేవుని వాక్యమును విత్తుచుండగా, అపవాది అబద్ధ బోధను అంటే గురుగులను విత్తుచుయుంటాడు. యుగసమాప్తివరకు దేవుని పని, అపవాది పని జరుగుచునే యుంటాది. కాలాంతమున అపవాది, అతని అనుచరులు అగ్నిగంధకములతో మండుగుండములో పడవేయబడుదురు (ప్రక 20:1). ఆ ఘడియ వచ్చువరకు అపవాది, వాని అబద్ధబోధనలు ఈ లోకంలోను, మనుష్యుల జీవితంలోను ఒకభాగమై యుంటాయి. అందువలన వీరిని గూర్చి యేసుప్రభువు, ఆయన అపొస్తలులు యిచ్చిన హెచ్చరికలను మనం ఎల్లవేళలా గుర్తుంచుకొని యుండాలి.

## కొన్ని తారతమ్యములు

అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి యని ప్రభువు హెచ్చ రించారు. అపవాది, లేక సాతానుడు మనుష్యుల ద్వారా పని చేస్తాడని మనం మొదట గ్రహించాలి. మత్తయి 10:17లో మనుష్యులను గూర్చి జాగ్రత్తపడుడి; వారు మిమ్మును మహాసభలకు అప్పగించి, కొరడాలతో కొట్టింతురు అని ఆయన చెప్పెను. గనుక అబద్ధ ప్రవక్తలు లేక బోధకులు క్రైస్తవ సమాజములో తప్పక ప్రబలి యుంటారు. అపొ.పేతురు ఇట్లను చున్నాడు: “మరియు అబద్ధప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీలోను అబద్ధ బోధకులుందరు; వీరు తమ్మును కొనిన ప్రభువును కూడ విసర్జించుచు, తమకు తామే శీఘ్రముగా నాశనము కలుగజేసి కొనుచు, నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుదురు. మరియు అనేకులు వారి పోకిరి చేష్టలను అనుసరించి నడుతురు; వీరిని బట్టి సత్యమార్గము దూషించబడును” (2పేతురు 2:12).

తరువాత అపో.పౌలు ఎఫెసులోని క్రీస్తు సంఘ పెద్దలతో ఆఖరిగ సమావేశమై నప్పుడు, ఈ అబద్ధ ప్రవక్తలు లేక బోధకులు ఎక్కడి నుండి వచ్చెదరో వారికి తెలియజేసాడు. "నేను వెళ్ళిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్ళుమీలో ప్రవేశించుదనని నాకు తెలియును; వారు మందను కనికరింపరు. మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలు దేరుదురు" (అపో.కా 20:29-30). సంఘ చరిత్రను మనం గమనిస్తే సంఘపాలన పద్ధతిలో క్రొత్త నిబంధన మాదిరిని సంఘనాయకులు ఉల్లంఘించి, సంఘమును వంకర త్రోవలో నడిపించిరని మనకు తెలియును.

అపో.పౌలు తిమోతిని ఈ విధంగా హెచ్చరించాడు: "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికులు వేషధారణ వలన మోసపరచు ఆత్మల యందును దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు" (1తిమో 4:1).

ఈ అబద్ధ బోధకులు దేవునిది కానిదైన బోధను బోధింతురు. వారుపైకి సువార్త బోధకులగానే యుందురు గని వారు బోధించేది వాక్యానుసారమైన బోధకాదు. వారు గొర్రెల చర్మము వేసికొని మీ యొద్దకు వత్తురుగాని లోపల వారు క్రూరమైన తోడేళ్ళని ప్రభువు చెప్పారు. గనుక అబద్ధ బోధకులుంటారు. వారు దేవుని ప్రజల మధ్య ప్రవేశిస్తారు,వారిని మనం గుర్తించవచ్చు, వారిని పరీక్షించవచ్చు, బయట పెట్టవచ్చు మరియు వారు బోధించే అబద్ధ బోధను బట్టి ఏ మతశాఖకు చెందినవారో మనం చెప్పెయొచ్చు అని ప్రభువు మాటలలోని భావమై యున్నది.

ప్రకటన గ్రంధములో యోహాను ద్వారా ఎఫెసులో యున్న సంఘమునకు ప్రభువు ఇట్లు వర్తమానము పంపారు: "నీ క్రియలను, నీ కష్టమును, నీసహనమును నేనెరుగుదును; నీవు దుష్టులను సహింపలేవనియు, అపొస్తలులు కాకయే తాము అపొస్తలులమని చెప్పుకొను వారిని పరీక్షించి వారు అబద్ధికులని నీవు కనుగొంటివనియు, నీవు సహనము కలిగి నానామము నిమిత్తము భారము భరించి అలయ లేదనియు నేనెరుగుదును" (ప్రక 2:2-3). ఎఫెసులో యున్న క్రైస్తవులు అబద్ధబోధకులను పరీక్షించారు. వారు అబద్ధికులని కనుగొని వారిని విసర్జించారు.

నేటి క్రైస్తవ లోకమంతయు వివిధ బోధలతో నిండియున్నది. వివిధ శాఖలుగా చీలియున్నది. ఇందులో ఏ ఒక్క శాఖవారు మరియొక శాఖవారితో బోధలోగాని, ఆచరణలోగాని ఏకీభవించరు. వీరందరు సత్యము చెప్పుచున్నవారు కానేరరు! ఏలయనగా సత్యము ఎల్లవేళలా ఏకత్వాన్ని, ఐక్యతను కలిగియుంటాది. అబద్ధ బోధయున్నచోట విభజనలుంటాయి, గందరగోళం ఉంటాది. యేసు క్రీస్తు ఈ బోధలన్నిటికి కర్తకారు. ఈశాఖలన్నిటికి ఆయన శిరస్సుకాదు. అందులో ఏ ఒక్క మతశాఖకు ఆయన శిరస్సు కాదు. ఆయన తన శరీరమైయున్న సంఘానికే శిరస్సు గాని మతశాఖలకు కాదు. "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్ళియున్నారు. గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" యని అందుకే భక్తుడైన యోహాను వ్రాసెను (1యోహాను 4:1). ఈ పరీక్ష దేవుని వాక్యము చొప్పున జరగాలి.

ఈ అబద్ధ బోధకులు కుయుక్తితోనే సంఘములో ప్రవేశిస్తారు. "ఇది ఆశ్చర్యము కాదు; సాతాను తానే వెలుగు దూతవేషము ధరించుకొనుచున్నాడు. గనుక వాని పరిచారకులును నీతి పరిచారకుల వేషము ధరించుకొనుట గొప్ప సంగతికాదు. వారి క్రియలు చొప్పున వారికంతము కలుగును" (2కొరింథీ 11:14-5). "అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి, మనుష్యుల మాయోపాయముల చేత వంచనతోను, తప్పుమార్గమునకు లాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొని పోవునట్లు కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటుఅటు కొట్టుకొని పోవుచు అలలచేత ఎగరగొట్టబడిన వారమైనట్లుండక, ప్రేమ కలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు మనమన్ని విషయములలో ఎదుగుదుము" (ఎఫెసీ 4:14-15).

అబద్ధ ప్రవక్తలు వస్తారని, వారు వేషధారులవలె వస్తారని చెప్పిన తరువాత వారి ఫలముల వలన మీరు వారిని తెలిసికొందురని ప్రభువు చెప్పారు. ముండ్ల పొదలలో ద్రాక్షపండ్లు కాయవు. పల్లేరు చెట్లను అంజూరపు పండ్లు కాయవు. అలాగే మంచి చెట్టు కాని ఫలములు ఫలింపదు. కాని చెట్టు మంచి ఫలములు ఫలింపదు. గనుక మన దగ్గరకు వచ్చు ప్రతి బోధకుని, అతడు తెచ్చు వర్తమానమును మనము నిశితముగా పరీక్షించాలి.

క్రైస్తవ జీవితం అతి జాగరూకతతో జీవించునట్టి జీవితం. అబద్ధ బోధకులు మోసముతోను, వంచన తోను వస్తారు గనుక మానవుల ఆత్మలకు వారివలన కలుగు ప్రమాదం గొప్పది. మన ప్రభువు అబద్ధ బోధకుని వేషభాషలను, వాని హృదయాన్ని పరీక్షించి వానిని క్రూరమైన తోడేలు అని పిలిచారు. దేవుని వాక్యం మనలను సంపూర్ణసిద్ధి కలిగినవారుగా తయారు చేస్తాది. ఆవాక్య బలముతో అసత్యాన్ని అబద్ధ బోధలను ఎదుర్కొనుటకు దేవుడు మనకు సహాయం చేయును గాక!! (2తిమోతి 3:16,17).

- జాషువా గూటం.

## 2000 సంవత్సరపు గారడీ

**(The magical Year 2000 )**

గారడీ 2000 సంవత్సరము ఇంక కొద్ది దూరములోనే యున్నది. ప్రపంచమంతయు ఆ సంవత్సరమునకు వాగ్దానములు చేయుటలో చాలా పనిపెట్టుకొని యున్నది. ఆ సంవత్సరములోని ప్రతీ దినము కూడా ఏదో ఒక ప్రాముఖ్యమైన పనిని సాధించుటకు నిర్ణయింపబడి యుండును. రాజకీయ మరియు మత సంబంధమైన రాజ్యములు లేక సంస్థలు 2000 సంవత్సరము కొరకు అనేక క్రొత్త ప్రతిపాదనలు తయారు చేయుచున్నారు.

ఉదాహరణకు ప్రపంచములోని మనవంటి అభివృద్ధి చెందుచున్న దేశాలలోని ప్రతిపాదనలు ఈ విధంగా యున్నవి.

| | |
|---|---|
| 2000 సంవత్సరము నాటికి | అందరికి విద్య |
| 2000 సంవత్సరము నాటికి | అందరికి గృహవసతి |
| 2000 సంవత్సరము నాటికి | అందరికి ఆహారము |
| 2000 సంవత్సరము నాటికి | అందరికి ఆరోగ్యము |
| 2000 సంవత్సరము నాటికి | అందరికి భద్రత |

ఇంకను 2000 సంవత్సరము నాటికి అందరికి త్రాగునీరు మరియు విద్యుత్తు మొదలుగునవి.

మత పరమైన రాజ్యములో కూడా ఇటువంటి ప్రతిపాదనలు ఉన్నవి.

2000 సంవత్సరము నాటికి ప్రపంచమంతటికి సువార్త

2000 సంవత్సరము నాటికి ప్రతీఇంటా బైబిలు

2000 సంవత్సరము నాటికి ప్రతీ గ్రామములోను ప్రతీ పట్టణములోను సంఘము స్థాపించుట

2000 సంవత్సరము నాటికి ప్రతీ సంఘములోను బోధకులు లేక సువార్తికులు.

2000 సంవత్సరము నాటికి అనేక కరపత్రములు, పుస్తకములు పంచుట.

ఈ విధముగా 2000 సంవత్సరము నాటికి ఏఏ కార్యములను మానవుడు చేయనుద్దేశించునో వానిని గూర్చి ఒక పెద్ద పొడవైన చిట్టాను తయారుచేయవచ్చు.

వ్యక్తిగతముగా, ఎవరైతే 2000 సంవత్సరమునకు తమ కార్యములను లేక ఉద్దేశములను లేక కోరికలను నెరవేర్చుటకు కార్యోన్ముఖులై ఉంటారోవారు, ప్రత్యేకముగా మత సంబంధమైన కార్యసాధకులుగా యుండాలని ఆశిస్తారో వారు చంద్రుని ఆరాధించేవారుగా యుంటారు అని నేను నమ్ముతాను. చంద్రుడు మనకు చాలా దూరములో ఉన్నాడు. మనకు దేనిని ఇవ్వడానికైన శక్తిహీనుడు. అదే విధముగా 2000 సంవత్సరము యొక్క ఘనత కూడా యుండును. ఇప్పుడు సాధించలేని కొన్ని గొప్ప సంఘటనలను 2000 సంవత్సరము నాటికి సాధించెదమని దానికి స్వాగతము పలుకుచున్నాము. ఈ రోజు సులభముగా చేయగల సంఘటనలను రేపు చేద్దాములే అనుకొనుట సోమరితనము కాదా ? మనము ఇపుడు సాధించగల గొప్ప యోచనలను 2000 సంవత్సరము నాటికి వాయిదావేయుట తప్పించుకొను మార్గము కాదా ?

వచ్చే శతాబ్దము అందరికి గొప్ప నిరీక్షణను కలుగజేయుననుటలో సందేహము లేదు కాన ఆ క్రొత్త శతాబ్దములో ఆ నిరీక్షణను మనము చేరుకొందుమా లేదా అనేది మరొక విషయము.

ఆ 2000 సంవత్సరము కూడా మిగిలిన క్రొత్త సంవత్సరముల లాంటిదే. ఆ సంవత్సరపు జనవరి 1వ తేదీకి మిగిలిన క్రొత్త సంవత్సరములకు ఎటువంటి భేధము ఉండదు.

తొలుత నిర్ణీత కాలములో ఎదుర్కొన్న సత్యములకంటే 2000 సంవత్సరములో కలుగ బోవు ఏ విధమైన గారడీ లేదు. రేపు లేక పోయినట్లయిన ఏమగును? ఒకవేళ 2000 సంత్సరము రాకుంటే ఏమగును ? ఇప్పుడు చేయవలసిన నిర్దిష్టమైన కార్యము లను చేయుటకు ప్రారంభించుటకు బదులుగా వాటిని 2000 సంవత్సరము నకు అనగా క్రొత్త శతాబ్దాన్కి ఆరంభమని తలంచి ప్రతీ విషయాన్ని 2000 సంవత్సరానికి త్రోసివేయుట ఎంత విచారకరము.

విచారకరమైన సంగతేమనగా 2000 సంవత్సరము అనునది మరియొక సంవత్సరము మాత్రమే గాని అది మన ఊహాగానాల యొక్క నిజస్వరూపము కాదు.

దేవుని సువార్తను బోధించుటకు మనకు మంచి ప్రారంభము ఈ దినముననే, ఇప్పుడే యుండాలి గాని 2000 సంవత్సరపు గారడీ శతాబ్దము క్రింద దాగుకొని యుండరాదు. రాజైన ప్రభువు యొక్క పనిని ఈ దినమందే శ్రద్ధతో చేయాలి. "తన పనిలో నిపుణత గల వానిని చూచితివా ? అల్పులైన వారి ఎదుటకాదు. వాడు రాజుల ఎదుటనే నిలుచును" (సామె 22:29). "కాగా నా ప్రియ సహోదరులారా మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని ఎరిగి స్థిరులును, కదలని వారును ప్రభువు కార్యాభివృద్ధి యందు ఎప్పటికిని ఆసక్తులై యుండుడి." (1కొరింథీ 15:58). "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూల సమయము. ఇదిగో ఇదే రక్షణ దినము" (2కొరింథీ 6:2).

- జార్జి అకపాలి, ఘనా, (VOT)

## "యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఏల నమ్మవలెను?"

**(Why we must Believe Jesus Christ as the Sun of God ?)**

"యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అను అంశము చాలా ప్రాముఖ్యమైనది. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్ముటకు ముందు "యేసుక్రీస్తు ఎవరు ?" అను విషయం తెలిసికొనుట అత్యంతావశ్యకమై యున్నది. యేసుక్రీస్తును గూర్చి అనేక ప్రవచనములు పరిశుద్ధ గ్రంథమందు లిఖించబడియున్నవి. కొన్నిటిని గురించి తెలిసికొందాము.

1. యేసుక్రీస్తు త్రిత్వములో ఒకరు:- దేవుడు మానవులను సృజింప సంకల్పించి "దేవుడు-మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము,..... అని పలికెను. "ఆది. 1:26.

ఈ వాక్యమందు మన-స్వరూపమందు, మన పోలిక చొప్పున నరులను చేయుదము అను బహువచన ప్రయోగము చేయబడినది. బహువచన మనగా ఒకరు గాక, ఇద్దరు లేక ముగ్గురు లేదా మరి అంతకంటే ఎక్కువ అని అర్థము వచ్చుచున్నది. కాబట్టి "మన" అను బహువచనములో "తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు"అను ముగ్గురు కలసియున్నారు. వీరు దైవత్వ మందును శక్తియందు ఒకటియై యున్నారు గాని, ముగ్గురు ఒక్కరు మాత్రము కాదు. మత శాఖలవారు "త్రియేక దేవుడు" అనగా ఒకే వ్యక్తియని బోధించు చున్నారు. మరియు పరిశుద్ధాత్ముడు "శక్తి" యేగాని వ్యక్తికాదని చెప్పుట మిక్కిలి విచారకరము. ఇవి లేఖనములకు విరుద్ధమైయున్నది. తండ్రి వ్యక్తియై యున్నాడు, యేసుక్రీస్తు వ్యక్తియై యున్నాడు. "అయితే ఆయన అనగా సత్య స్వరూపియైన ఆత్మవచ్చినపుడు మిమ్మును సర్వసత్యము లోనికి నడిపించును. ఆయన తనంతట తానేమియు బోధించక వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియ జేయును." యోహా 16:13. ఈ వాక్యములో పరిశుద్ధాత్మునికి ఆయన అను పద ప్రయోగము చేయబడినది. ఆయన అను పదము వ్యక్తి గాని, శక్తికి ఉపయోగించరు. కాబట్టి పరిశుద్ధాత్ముడు ఒక వ్యక్తియై యున్నాడు. "యేసుక్రీస్తు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలో నుండి ఒడ్డునకు వచ్చెను ఇదిగో ఆకాశము తెరువబడెను దేవుని ఆత్మ పావురము వలె దిగి తన మీదకు వచ్చుట చూచెను. మరియు-ఇదిగో ఈయనే నాప్రియ కుమారుడు ఈయన యందు నేనానందించు చున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను. " మత్త. 3:16,17. ఇచ్చట తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు ఒకేసారి ప్రత్యక్ష మగుట చూడగలము. మరియు అపొస్తలుడైన పౌలు ఎఫెస్సీ సంఘమునకు వ్రాయుచు "తండ్రియైన దేవుడు ఒక్కడే, ప్రభువు ఒక్కడే, ఆత్మయు ఒక్కడే" యని చెప్పెను (ఎఫెసీ 4:4,5). కావున

యేసుక్రీస్తు త్రిత్వములో ఒకరైయున్నారు.

2. యేసుక్రీస్తు సృష్టికర్త:- "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆది. 1:1). ఈ సృష్టియందు యేసుక్రీస్తు కూడ భాగస్వామియై యున్నాడు. ఏలయన ? "ఆదియందు వాక్యము ఉండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడైయుండెను, ఆవాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను" (యోహా. 1:1,14). ఈ వాక్యమును బాగుగా పరిశీలించిన వాక్యమైన దేవుడు శరీరమును ధరించి యేసుక్రీస్తుగా మన మధ్య నివసించెనని తేటపడుచున్నది. "ఆయన దేవుని యొద్ద ఉండెను, సమస్తమును ఆయన మూలముగ కలిగెను. కలిగి యున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు" (యోహా.1:2,3). మరియు "ఆయన అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవి అదృశ్యమైనవి....... సర్వమును ఆయన ద్వారా, ఆయనను బట్టి సృజించబడెను." (కొలస్స 1:15,16). కాబట్టి యేసుక్రీస్తు సృష్టికర్త.

3. యేసుక్రీస్తు సర్వాధికారియైన దేవుడు :- యేసుక్రీస్తు దేవుడని అంగీకరించని మత చాందస్సులు యింకను భూమిమీద ఉండుట మిక్కిలి శోచనీయము. అట్టివారిలో "యెహోవా సాక్షులు" ఒకరు. వారు లేఖనములను అర్థము చేసికొనరు. కారణం ? "దేవుని స్వరూపియై యున్న క్రీస్తు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింప కుండునిమిత్తము ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను" (2కొరింథీ 4:4). అందువలన వారు యేసుక్రీస్తును దేవుడని గ్రహించలేరు, గ్రహించరు. ఈవిషయమై రెండవ అంశములో యేసుక్రీస్తు దేవుడని నిరూపింపబడెను. అట్టివి పరిశుద్ధగ్రంథమందు అనేకం కలవు గాని, స్థలాభావం వలన మరొక్క రుజువు మీ ముందుంచ నాశించుచున్నాను. "పితరుల వీరివారు. శరీరమును బట్టి క్రీస్తు వీరిలో పుట్టెను. ఈయన సర్వాధికారియైన దేవుడైయుండి నిరంతరం స్తోత్రార్హుడై యున్నాడు (రోమా 9:5). యేసుక్రీస్తు పరలోకమునకు

ఆరోహణమగుటకు ముందు శిష్యులతో"..........పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది" అని చెప్పెను (మత్త 28:18). మరియు "...... దేవత్వముయొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" (కొల 2:9). కాబట్టి యేసుక్రీస్తు సర్వాధి కారియైన దేవుడైయుండెను.

4. యేసుక్రీస్తు రక్షకుడు :- మానవులు దేవునిపై తిరుగుబాటు చేసి పాపమునకు లోనైరి. "అరికాలు మొదలుకొని తలవరకు స్వస్థత కొంచెమైనను లేదు, ఎక్కడ చూచినను గాయములు, దెబ్బలు, పచ్చిపుండ్లు. అవిపిండబడలేదు, కట్టబడలేదు, తైలముతో మెత్తన చేయబడలేదు" (యెష 1:6). అందువలన ప్రవక్తద్వారా యిట్లు తెలియజేయబడెను." ..... మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగ వచ్చెను, మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను, గనుక ఆయన ఆలకింపకున్నాడు" (యెష 59:1,2). ఇట్లు దేవునితో మానవుని సంబంధము తెగిపోయెను. "మనమందరము గొర్రెలవలె త్రోవతప్పిపోతిమి, మనలో ప్రతివాడును తన కిష్టమైన త్రోవకు తొలగెను. భవిషత్‌ను ఎరిగిన ప్రేమమూర్తియైన దేవుడు ఆదాము, హవ్వలు పాపము చేసినపుడే లోకరక్షకుని వాగ్దానము చేసెను. "మరియు నీకును స్త్రీకిని, నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను, అది నిన్ను తలమీద కొట్టును, నీవు దానిని మడిమ మీద కొట్టుదువని చెప్పెను" (ఆది 3:15). అయితే "కాలము సంపూర్ణమైనపుడు దేవుడు తన కుమారుని పంపెను, ఆయన స్త్రీయందు పుట్టి మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడి యున్నవారిని విమోచించుటకు ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను" (గలతీ 4:4,5). లేఖనము (యెష 7:14) నెరవేరునట్లుగా యోసేపుకు ప్రధానం చేయబడిన మరియ వారేకము కాక మునుపు పరిశుద్ధాత్మవలన గర్భవతి యయ్యెను. యోసేపు రహస్యముగా ఆమెను విడనాడ నుద్దేశించగా ప్రభువు దూత స్వప్న మందు అతనికి ప్రత్యక్షమై దావీదు కుమారుడవైన యోసేపూ నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము. ఆమె పరిశుద్ధాత్మవలన గర్భము

ను ధరించినది, ఆమెయొక కుమారుని కనును, తన ప్రజలను వారి పాపము లనుండి ఆయనే రక్షించును, గనుక ఆయనకు యేసు అను పేరుపెట్టుదు వనెను" (మత్త 1:18-21). యేసు అనగా రక్షకుడని అర్థము. ఈ యేసే మానవుల పాప పరిహారార్థము తన రక్తమును మూల్యముగా చెల్లించి పాప విముక్తి గావించెను. "...... ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతిపాపమునుండి మనలను పవిత్రులునుగా చేయును" (1యోహా 1:7). కావున యేసుక్రీస్తు రక్షకుడు. (మిగతా వచ్చే సంచికలో)

- G. మార్క్, నందిగామ.

## వచ్చి చూడుడి

### (Come and See)

యోహాను యొక్క ఇద్దరు శిష్యులు అడిగిన ప్రశ్నకు యేసుప్రభువు "వచ్చి చూడుడి" యని జవాబిచ్చారు (యోహాను 1:39). ప్రభువు యొక్క ఆహ్వానమును వారిద్దరు అంగీకరించి వెళ్ళిచూచిరి. తత్ఫలితముగా వారు యోహానును విడిచి యేసును వెంబడించిరి!

మీ ఊరిలో యున్న క్రీస్తుసంఘము వారు పౌలు కాలమునాటి "క్రీస్తు సంఘముతో" నామములోను, సభ్యత్వములోను, ఆరాధనలోను, ఐక్యతలోను, నిర్మాణములోను, ఆచరణ, కృషిలోను సరిపోలియున్నారో లేదో వచ్చిచూడుడి యని ఆహ్వానించుచున్నారు. క్రొత్త నిబంధనను సంపూర్తిగా అనుసరించుట వలననే నిజమైన క్రీస్తు సంఘము ఏర్పడును.

క్రీస్తు నిర్మించిన సంఘముతో రక్షింపబడినవారు ప్రభువుచే చేర్చబడిరి (అపొ.కా. 2:4:47). ఆనాడు మరొక సంఘము యేదీ లేదు. వారుచూపిన విధేయత వలన రక్షింపబడిరి. ప్రభువుచే ఆయన సంఘములో చేర్చబడిరి (అపొ.కా. 2:47). వందలాది సంవత్సరముల తరువాతనే డినామినేషన్లు ఏర్పడినవి. మానవకల్పిత డినామినేషన్లు నేడు వందల కొలది యున్నను వాటిలో చేరవలసిన కారణం యేదీ లేదు. నీవు క్రైస్తవునిగా మాత్రమే, క్రీస్తు సంఘసభ్యునిగా మాత్రమే

ఎందుకు ఉండకూడదు ? (మత్త 16:18; అపొ.కా. 2:47; రోమా 16:16; అపొ.కా. 26:28; 1పేతురు 4:16).

## క్రీస్తు సంఘము క్రీస్తుచే స్థాపించబడెను

క్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించుటకు వాగ్దానము చేసెను. "ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవని" ఆయన చెప్పెను (మత్త 16:18). క్రీస్తు ఒకే ఒక్క సంఘము కొరకు చనిపోయెనని పౌలు చెప్పెను: "అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి...... దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను" (ఎఫెసీ 5:25). సంఘము అనునది ఒకే ఒక దానిని సూచించును. దానికొరకు అన్నప్పుడు కూడ ఒకే ఒక్కటి సూచింపబడుచున్నది. గనుక క్రీస్తు ఒకే ఒక్క సంఘమును ప్రేమించెను, ఒకే ఒక్క దానికొరకు చనిపోయెను, ఆయన ఒకే ఒక్కదానిని స్థాపించెను. అందువలన ఆయన ఒకే ఒక్క సంఘము యొక్క యజమాని. ఒక ప్రాంతములో యుండు స్థానిక సంఘముల నుద్దేశించుటలో తప్ప మరెన్నడు 'సంఘములు' అను పదము క్రొత్త నిబంధనలో వినియోగింపబడలేదు. ఉదా: "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:16). "యూదయ సంఘములు" (గలతీ 1:22).

## క్రీస్తు సంఘము యెరూషలేములో స్థాపించబడెను

యేసుక్రీస్తు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తునాడు క్రీస్తు సంఘము యెరూషలేములో స్థాపించబడెను. అనేక సంగతులు దీనిని సూచించుచున్నాయి. క్రీస్తు చనిపోవక కొన్ని దినముల ముందు సంఘారంభము ఇంకా భవిష్యత్తులో యున్నట్లు "ఈ బండమీద నా సంఘమును కట్టుదును" అని ఆయన పలికిన మాటలే చెప్పుచున్నవి (మత్తయి 16:18). కట్టుదును అనుమాట భవిష్యత్తును సూచించు చున్నది. అయితే పెంతెకొస్తు అనంతరము సంఘము ఉనికి కలిగియున్నట్లు ఎల్లప్పుడు చెప్పబడింది. నిజానికి ఆనాడు ఇంచుమించు మూడువేలమంది వారితో చేర్చబడిరి (అపొ.కా. 2:41). మరియు ప్రభువు రక్షణ

పొందుచున్న వారిని అను దినము వారితో చేర్చుచుండెను (అపొ.కా. 2:47). అపొ.కా. 2, పెంతెకొస్తు తరువాత సంఘము భవిష్యత్తులో కట్టబడునట్లు ఎన్నడు చెప్పబడలేదు. అందువలన అపొ.కార్యములు రెండులో, పెంతుకొస్తునాడు సంఘము స్థాపింపబడినట్లు రుజువగుచున్నది. అదే దాని ఆరంభమని నిజానికి పేతురు ప్రకటించెను (అపొ.కా. 11:15).

## క్రీస్తు సంఘమునకు శిరస్సు

సంఘమునకున్న ఏకైక శిరస్సు క్రీస్తే. పౌలు ఇట్లనుచున్నాడు: "మరియు సమస్తమును ఆయన పాదములు క్రిందఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము, సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22,23). "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు" (కొలస్స 1:18). క్రీస్తు శరీరమును గూర్చి ఈ లేఖన భాగములు చెప్పుచున్నప్పుడు అవి ఆయన భౌతిక శరీరమును గూర్చిగాక, ఆత్మీయ శరీరమగు సంఘమును గూర్చి చెప్పుచున్నవని తెలియనగును. దయచేసి గమనించండి. 1. క్రీస్తు తన సంఘమునకు శిరస్సై యున్నాడు. (కొలస్స 1:18; ఎఫెసీ 1:22,23). 2. క్రీస్తులో యున్న వారందరు ఆయన శరీరమై యున్నారు (గలతీ 3:27; కొలస్స 3:15). 3. క్రైస్తవులందరు క్రీస్తులో యున్నవారు (రోమా 6:3; 2కొరింథీ 5:17). 4. గనుక క్రైస్తవులందరు క్రీస్తు సంఘములో యున్నవారు. మానవులను రక్షించుటకు యేసుక్రీస్తు ఒకే ఒక సంస్థను స్థాపించుటకు ఈ లోకమునకు వచ్చెను (ఎఫెసీ 3:10. 11, 21).

## బైబిలు తప్ప క్రీస్తు సంఘమునకు వేరొక మార్గదర్శిలేదు

మానవకల్పిత ప్రమాణ పుస్తకములనేదీ క్రీస్తు సంఘము అంగీకరించదు. ఆత్మావేశములేని మానవ లిఖిత ప్రమాణములు, నియమములు, మత సంబంధ కట్టడలను క్రీస్తు సంఘము అంగీకరించదు. దేవుని వాక్యము ఒక్కటి మాత్రమే దాని ప్రమాణముగా అది అంగీకరించును. ఏలయనగా, "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన

కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును ఖండించుటకును తప్పుదిద్దుటకును నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2తిమోతి 3:16,17). "మనలను పిలిచినవాని గూర్చిన అనుభవ జ్ఞాన మూలముగా ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున..... " అని పేతురు పలికాడు (2పేతురు 1:3). మరల, "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్లు బోధింపవలెను; ఒకడు ఉపచారము చేసిన యెడల దేవుడు అను గ్రహించు సామర్థ్యము కొలది చేయవలెను. ఇందువలన దేవుడు అన్నిటిలోను యేసుక్రీస్తు ద్వారా మహిమ పరచబడును. యుగయుగములు, మహిమయు ప్రభావమును ఆయనకుండును గాక, ఆమేన్" అని అతడు చెప్పెను (2పేతురు 4:11). అందువలన అందరు బైబిలునొద్దకు మరలుడి యని మేము బ్రతిమలాడు చున్నాము. బైబిలే రైటని గుర్తించుకొనుము!

యేసుక్రీస్తు దేవుని కుమారుడను ప్రమాణము తప్ప వేరొకటి క్రీస్తు సంఘమునకు లేదు. క్రీస్తునందలి విశ్వాసులందరి ఐక్యత కొరకు ఆది విజ్ఞాపన చేయుచున్నది. బైబిలు మాట్లాడుచోట మాట్లాడుదము, అది మౌనియైన చోట మౌనులమై యుందము, బైబిలు నామములనే ధరించుచు, బైబిలు సంగతులను బైబిలు ప్రకారమే చేయుదము. 1కొరింథీ 1:10లో పౌలు ఇచ్చిన దైవిక ఆజ్ఞను అనుసరించుటకది పూనుకొనును: "సహోదరులారా, మీరందరు ఏక భావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక యేక మనస్సుతోను ఏకతాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను". ఐక్యత కొరకు ప్రభువు యోహాను 17:21లో చేసిన ప్రార్ధనను నెరవేర్చుటయే మా ధ్యేయము. క్రొత్త నిబంధన నమూనా ప్రకారము ప్రపంచ మందంతటా క్రొత్త నిబంధన సంఘములను స్థాపించుటయే క్రీస్తు సంఘము యొక్క ధ్యేయము. (సశేషం).

- గార్లండ్ ఎల్కిన్స్.

గారు, జాషువా గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. సోదరి నేన్సీ ఫోర్డు గారు స్త్రీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించిరి. వరంగల్లు జిల్లానుండి వచ్చిన అనేకులలో 430 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వరంగల్లు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ వారు చక్కటి ఏర్పాట్లు చేసి సభలను జయప్రదము గావించిరి. నెహెమ్యా గూటం గారు వరంగల్లు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌కు డైరక్టరు గాను, కె. సత్యనారాయణ గారు సహాయ డైరక్టరు గాను పనిచేయుచు దానిని నిర్వహించుచున్నారు. సోదరులు కె. సత్యనారయణ గారు వరంగల్లులో క్రీస్తుకొరకు గొప్ప పనిచేయుచున్నారు.

జనవరి 20వ తేదీ సోమవారంనాడు కాకినాడ సత్యవాణి భవనములో హెర్షల్ బియర్డన్ గారు, చార్ల్స్ డీటన్ గారు, రోయస్ ఫ్రెడరిక్ గారు వాక్య పరిచర్య చేసిరి. శ్రీకాకుళం నుండి వచ్చిన ఆర్. సి. హెచ్. సద్గుణరావ్ గారు వారి వర్తమానములను తెలుగున కనువదించిరి. సదస్సు అనంతరము తుఫాను బాధిత ప్రాంతములను సువార్తికులను పైనుదహరించిన సహోదరులు ఆదరించి, వారికి సహాయమందించిరి. పిమ్మట వారు ఆయా గ్రామములను సందర్శించి, సంఘములను సహోదరులను పరామర్శించి సంఘములకు తగు సహాయ మందించిరి. వారు ప్రతిచోట వాక్య పరిచర్య చేయగా వారు సందర్శించిన 4 దినములలో ఇంచుమించు 70 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

సోదరులు ఐరారైస్ గారు వ్రాసిన బేసిక్ బైబిలు కోర్సు ఇప్పుడు తెలుగులో లభించుచున్నది. అందున్న పాఠములను జయప్రదముగా ముగించిన వారికి ఒక యోగ్యతాపత్రము, తెలుగు బైబిలు బహూకరించబడుచున్నది. గత 7 మాసములలోను కొన్ని వందల మంది దీనిలో చేరి బైబిలు సత్యములను గ్రహించి బాప్తిస్మము పొందియున్నారు. మీ సంఘములలో యున్నవారు కూడ బేసిక్ బైబిలు కోర్సులో చేరునట్లు ప్రోత్సాహించండి.

మీరు క్రీస్తు సంఘములో బోధకులైనను, కాకపోయినను, ఉద్యోగస్థులైనను, విద్యార్థులైనను, గృహిణులైనను కాకపోయినను **Basic Bible Course** లో చేరండి క్రొత్త నిబంధన సత్యమును విపులముగా తెలుసుకొనండి. ఉచిత పాఠముల కొరకు ఈ రోజే దిగువ చిరునామాకు వ్రాయండి:

**The Director**

**Bible Correspondence Course**

**P. O. Box.80, Kakinada - 533 001**

Regd. No. H / KD-45 / K.D. H.O

Date of Posting : 15 th of Every month

**From:**

SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

**To**